క్లుప్తంగా

రైతులకు ఉపయోగపడే పనులు చేపట్టాలి



పాన్‌గల్: గ్రామాల్లో చేపడుతున్న ఉపాధి పనుల్లో రైతులకు ఉపయోగపడే పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి ఉపాధి సిబ్బందికి సూచించారు. గురువారం మండలంలోని దావాజిపల్లిలో సాగునీటి కాల్వలో నిర్వహిస్తున్న ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. పనుల వద్ద వేసవి కాలం దృష్ట్యా కూలీలకు ఇబ్బందులు కలుగకుండా పంచాయతీ ఆదర్యంలో నీడ, నీటి వసతులు ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు.

హలీం పంపిణీ



వనపర్తి: జిల్లా కేంద్రంలోని 28వ వార్డులో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఓబీసీ సెల్ చైర్మన్ కోట్ల రవి రంజాన్ ఉపవాస దీక్షల సందర్భంగా హలీం పంపిణీ చేశారు. మైనార్టీ రాష్ట్ర నాయకులు అక్బర్, అనీష్‌లతో కలిసి కాలనీలో పర్యటించి ఉపవాసం చేసిన ముస్లిం కుటుంబాలకు హలీం ప్యాకెట్లను అందించారు. త్వరలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేస్తామని యూత్ కాంగ్రెస్ నాయకులు వెల్లడించారు. కార్యక్రమంలో పెంటన్న, చీర్ల చందర్, కృష్ణబాబు, వేణయ్య, చారి, అక్షయ్‌కుమార్, నాగరాజు, అబ్దుల్లా, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



అమరచింత: వేసవిలో ఏర్పాటు చేస్తున్న చలివేంద్రాలు బాటసారుల దాహార్తిని తీర్చుతాయని మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ, తహసీల్దార్ చాంద్‌పాషా అన్నారు. మండల కేంద్రంలో దేశాయి ప్రకాష్‌రెడ్డి సేవా సమితి ద్వారా ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గురువారం వారు ప్రారంభించారు. కార్యక్రమంలో కమిషనర్ మహమ్మద్ ఖాజా, డీఎంఆర్ఎం ట్రస్ట్ సభ్యురాలు సౌజన్యరెడ్డి, నాయకులు నరేష్‌రెడ్డి, నరసింహులుగౌడ్, నాగభూషణంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అధికారంలోకి రాగానే ఉద్యోగాలు భర్తీ చేస్తాం

గోపాల్‌పేట: రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అత్యధిక మెజార్టీతో గెలిచి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతోందని, ఆ వెంటనే ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగ ఖాళీను భర్తీ చేస్తామని మాజీ మంత్రి చిన్నారెడ్డి అన్నారు. గురువారం హాథ్ సేహాథ్ జోడోయాత్రలో భాగంగా ఆయన గోపాల్‌పేట మండలంలోని పొలికెపాడు, తండాలు, లక్ష్మిదేవిపల్లి, చాకల్‌పల్లి, అనంతపురం, ఏదులలో పర్యటించారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ప్రజల నుంచి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పైకి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని చెప్పుకుంటున్న బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు పేదల కొరకు చేసిన పనులు ఏవీ లేవని అన్నారు. పేదలు ప్రస్తుతం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారి పక్షాన నిలబడి వారికి న్యాయం చేసే పార్టీ కాంగ్రెస్ మాత్రమేనని అన్నారు. ఉపాధి, ఉద్యోగాలు లేక యువత నిరాశ నిస్పృహలకు లోనవుతున్నారని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి ఇచ్చిన వెంటనే రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగ ఖాళీలను భర్తీ చేస్తామన్నారు. కార్యక్రమంలో వనపర్తి జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, గోపాల్‌పేట మండల వర్కింగ్ ప్రెసిడెంట్ నరహరి, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు కొంకి వెంకటేష్, ప్రవీణ్‌కుమార్, రోహిత్, తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే సంక్షేమం



కొత్తకోట: కానాయపల్లిలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం హాథ్ సే హాథ్ జోడో కార్యక్రమంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు నరోత్తంరెడ్డి హాజరై మాట్లాడారు. ఉపాధి కూలీల దగ్గరకి వెళ్లి కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను వివరించారు. అలాగే కాంగ్రెస్ అధికారంలోకి వస్తే చేపట్టబోయే సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించినట్లు టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కాటం ప్రదీప్‌కుమార్‌గౌడ్ తెలిపారు. కార్యక్రమంలో నాయకులు వేణుగోపాల్, శ్రీనివాస్, మహేష్, అక్కి రాఘవేంద్రగౌడ్, వెంకటేశ్వర్‌రెడ్డి, కురుమూర్తి, నాయిని ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతోనే గ్రామాల అభివృద్ధి

- ప్రజాప్రతినిధులు, అధికారులు బాధ్యతతో మెలగండి
- ఈజీఎస్ పనులపై ఫిర్యాదులు రానివ్వొద్దు
- ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

అమరచింత: ప్రజాప్రతినిధులు, అధికారుల భాగస్వామ్యంతోనే గ్రామాల్లో అభివృద్ధి పనులు ముందుకు సాగుతాయని, విధుల్లో నిర్లక్ష్యం వహించే అధికారులను సహించమని మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. అమరచింత మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ డాక్టర్ చుక్క మాలతి అధ్యక్షతన గురువారం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే ఆయా శాఖల అధికారుల నుంచి ప్రగతి నివేదికను అడిగి తెలుసుకున్నారు. సర్పంచ్‌లు తమ గ్రామాల్లో ఈజీఎస్ పనులు కొనసాగడం లేదని, పనిచేసిన కూలీలకు డబ్బులు సకాలంలో ఇవ్వకపోవడంతో వారు వంద రోజుల పనులకు రావడం లేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఏపీఓ బాలయ్యను పిలిపించి గ్రామాల్లో అడిగినంత ఉపాధి పనులు కల్పించాలని, ప్రతి కూలీకి సకాలంలో డబ్బులు చెల్లించాలని ప్రభుత్వ ఆదేశాలు ఉన్నా.. ఎందుకు పాటించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోమారు ఉపాధి పనులు జరగడం లేదని ఫిర్యాదులు వస్తే సహించేది లేదని హెచ్చరించారు. గ్రామాల్లో ట్రాన్స్‌కో అధికారులు సమస్యలను పరిష్కరించడం లేదని ట్రాన్స్‌ఫార్మర్లకు డీడీలు కట్టినా ఇప్పటి వరకు ఇవ్వట్లేదని సర్పంచ్‌లు ఆందోళన చేయగా.. వారం రోజుల లోపు సమస్యను పరిష్కరించాలని ట్రాన్స్‌కో ఏఈ రాంచంద్రయ్యను ఆదేశించారు.

తాగునీటిపై దృష్టి

వేసవిని దృష్టిలో ఉంచుకొని ఆయా గ్రామాల్లో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మిషన్ భగీరథ అధికారులు సర్పంచ్‌ల సహకారంతో పైప్‌లైన్ల లీకేజీలు గుర్తించి వేగంగా మరమ్మతు పనులు చేపట్టి స్వచ్ఛమైన తాగునీటిని అందించాలన్నారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తమ గ్రామాల పరిధిలో నీటి ఎద్దడి తీవ్రంగా ఉంటే వెంటనే సమస్యను తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బాల్‌రెడ్డి, జెడ్పీటీసీ మార్క సరోజ, మార్కెట్ చైర్మన్ ఎస్ఏ రాజు, ఎంపీడీఓ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాలో ఆటంకాలొద్దు



సమస్యను వివరిస్తున్న ఎంఈఓ శ్రీనివాస్‌గౌడ్

గోపాల్‌పేట: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ సంధ్య అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశంలో సభ్యులు తమ సమస్యలను వివరించారు. సమావేశానికి హాజరైన ఎంఈఓ శ్రీనివాసులుగౌడ్ మాట్లాడుతూ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనానికి కావాల్సిన బియ్యాన్ని రేషన్ షాపుల్లో ఉంచుతున్నారని, ప్రభుత్వం నుంచి వచ్చే బియ్యాన్ని నేరుగా పాఠశాలలకే తరలించాలని కోరారు. గోపాల్‌పేటలోని బాలికల హాస్టల్‌లో ఇంకుడు గుంత లేక ఇబ్బంది ఉందని సభ దృష్టికి తీసుకురాగా.. వెంటనే స్పందించిన వైస్ ఎంపీపీ శేఖర్ హాస్టల్‌లో ఇంకుడు గుంత నిర్మించాలని ఏపీఓ నరేందర్‌ను ఆదేశించారు. అనంతరం భగీరథ అధికారులు మాట్లాడుతూ తొందర్లోనే గ్రామాల్లో తాగునీటి కష్టాలు తీరుతాయని తెలిపారు. మండల కేంద్రంలో ఇప్పటికే ఉన్న రామన్‌పాడ్ పంప్‌హౌస్‌లో 10 ఎంఎల్‌డీ కెపాసిటీతో మరో పంప్‌హౌస్ నిర్మిస్తున్నామన్నారు. అది పూర్తయితే చుట్టు పక్కన గ్రామాలు, మండలాలకు తాగునీటికి సమస్య ఉండదని, నెలరోజుల్లో అది అందుబాటులోకి వస్తుందని మిషన్ భగీరథ ఏఈ మొగులయ్య అన్నారు. అనంతరం ఎంపీపీ సంధ్య మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనులు పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. జెడ్పీటీసీ సభ్యురాలు భార్గవి, ఎంపీడీఓ ఉసేనప్ప, సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు రక్త పరీక్షలు



అమరచింత: ఫైలేరియా వ్యాధి నిర్మూలనకు ప్రభుత్వం ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న చిన్నారులకు రక్త పరీక్షలు నిర్వహిస్తుందని ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి డాక్టర్ శరత్ అన్నారు. ఆత్మకూర్ పట్టణంలోని ప్రభుత్వ ఉర్దూమీడియం పాఠశాలలో గురువారం ఒకటి, రెండు తరగతులు చదువుతున్న చిన్నారుల నుంచి రక్త నమూనాలు సేకరించారు. కార్యక్రమంలో ల్యాబ్ టెక్నీషియన్ రాజు, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసులు, ఏఎన్ఎం హైమావతి పాల్గొన్నారు.

చంద్రయ్యకు ఘన నివాళి



పెబ్బేరు రూరల్: అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో శ్రీరంగాపురం మండల కేంద్రంలో గురువారం అంబేడ్కర్ యువజన సంఘం వ్యవస్థాపకుడు అయిన దేవని చంద్రయ్య రెండో వర్ధంతిని నిర్వహించారు. అంబేడ్కర్ చౌరస్తాలో నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

శనగపప్పు కొనుగోలు కేంద్రం ప్రారంభం



కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న చైర్మన్ బగ్గరి నరసింహారెడ్డి

చిన్నంబావి: మండల కేంద్రంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కొప్పునూరు, మార్క్‌ఫెడ్ వనపర్తి ఆధ్వర్యంలో శనగపప్పు కొనుగోలు కేంద్రాన్ని చైర్మన్ బగ్గారి నరసింహారెడ్డి ప్రారంభించారు. ప్రభుత్వం మద్దతు ధర రూ.5,335 నిర్ణయించిందని, సోమవారం నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేస్తారని తెలపారు. మొదటి రోజు అయ్యవారిపల్లి, చెల్లపాడు, వెంకటాంపల్లి రైతులు పప్పుశనగ తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ డీఎం భాస్కర్‌రెడ్డి, ఎంపీపీ సోమేశ్వరమ్మ, జెడ్పీటీసీ వెంకటరమణమ్మ, సీఈఓ నాగరాజు, ఏఈఓ రజిత, సొసైటీ సిబ్బంది వెంకటస్వామి, మురళీ, శేఖర్, డైరెక్టర్లు శ్రీకాంత్‌రెడ్డి, భగవంతు, తిప్పల మద్దిలేటి, గుంటి వెంకటస్వామి, రైతుసమన్వయ సమితి అధ్యక్షుడు మద్దిలేటి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఈదన్న, సీనియర్ నాయకులు చిన్నారెడ్డి, సుధాకర్‌రెడ్డి, రైతులు నాగిరెడ్డి, పుల్లయ్య, బడికెల బాలరాజు, కొప్పునూరు, పెద్దదగడ హమాలీలు పాల్గొన్నారు.

కనులపండువగా వేంకటేశ్వరస్వామి కల్యాణం

అమరచింత: ఆత్మకూర్ మండలంలోని ఆరేపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య శ్రీనివాసుడి కల్యాణాన్ని అర్చకులు కనులపండువగా నిర్వహించారు. ఆలయ నిర్మాణం చేపట్టి ఏడేళ్లు పూర్తయిందని, ప్రతి ఏడాది ఆలయంలో ప్రత్యేక పూజలతో పాటు స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. సింగిల్ విండో అధ్యక్షుడు లక్ష్మీకాంత్‌రెడ్డి దంపతులు, వైస్ ఎంపీపీ కోటేశ్వర్ దంపతులు, హెల్త్ సూపర్‌వైజర్ సురేందర్‌గౌడ్ దంపతులు పాల్గొని కల్యాణ ఉత్సవాన్ని నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ అనసూయ, ఉపసర్పంచ్ తిరుపతయ్య, యుగంధర్‌గౌడ్, పంచాయతీ కార్యదర్శి నరేష్ పాల్గొన్నారు.

ఈద్గా, శ్మశానవాటికకు స్థలం కేటాయించాలి



ఎంపీపీకి వినతిపత్రం అందజేస్తున్న మైనార్టీ సంఘం నాయకులు

పాన్‌గల్: మండలంలోని చింతకుంటలో మైనార్టీలకు కమిటీ హాల్, ఈద్గా, శ్మశాన వాటికలకు స్థలాలు కేటాయిస్తూ నిర్మాణం చేపట్టేలా తగు చర్యలు తీసుకోవాలని మైనార్టీ సంఘం ఆధ్వర్యంలో గురువారం ఎంపీపీ మామిళ్లపల్లి శ్రీధర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు మాట్లాడుతూ గ్రామంలో ఉన్న ముస్లింలకు కమిటీ హాల్ లేకపోవడంతో శుభకార్యాలు, సమావేశాలు నిర్వహించుకోవడం కష్టంగా మారిందని, దీంతో పాటు ఈద్గా లేకపోవడంతో పండుగల సమయంలో ప్రార్థనలు చేసుకోవడం ఇబ్బందిగా ఉందన్నారు. దీంతో పాటు ప్రస్తుతం ఉన్న శ్మశానవాటిక స్థలం పూర్తిగా శవాలతో నిండిపోయి స్థలం కొరత ఏర్పడిందని వారు వినతిపత్రంలో పేర్కొన్నారు. ఆయా సమస్యలను కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి వాటి పరిష్కారం కోసం తగు చర్యలు తీసుకుంటామని సంఘం నాయకులకు ఎంపీపీ హామీ ఇచ్చారు.

వైభవంగా హనుమాన్ శోభాయాత్ర



పెబ్బేరులో హనుమాన్ శోభాయాత్రలో పాల్గొన్న హిందూవాహిని సభ్యులు



అమరచింతలో..

అమరచింత: హనుమాన్ జయంతిని పురస్కరించుకొని గురువారం అమరచింత, ఆత్మకూర్ మండలాల్లోని ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయాల్లో అన్నదానం, భజనలు చేశారు. యువకులు బైక్‌ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో అమరచింత, ఆత్మకూర్ మున్సిపల్ చైర్‌పర్సన్లు గాయత్రి, మంగమ్మ, వైస్ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు రవికుమార్‌యాదవ్, రమేష్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

గోపాల్‌పేట: మండల కేంద్రంలో గురువారం హనుమాన్ శోభాయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా చెన్నకేశవ స్వామి ఆలయం నుంచి బస్టాండు, వీధుల్లో శోభాయాత్ర కొనసాగింది. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి, ఎంపీపీలు మేఘారెడ్డి, కిచ్చారెడ్డి, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు అనుజ్ఞారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెబ్బేరు: పట్టణంలోని రామాలయంలో అంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రధాన రోడ్డుపై శోభాయాత్ర కొనసాగించారు. భక్తులు భజనలు, భక్తిపాటలు, డప్పులతో నృత్యాలు చేసుకుంటూ వీధుల్లో ఊరేగింపు చేశారు.

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలో బెస్తగేరి అంజనేయస్వామి ఆలయంలో స్వామి వారికి అభిషేకం తదితర ప్రత్యేక పూజలు నిర్వహించిన గ్రామస్తులు హనుమాన్, శ్రీరాముని విగ్రహాలను వాహనాలపై అలంకరించి గ్రామంలో ఊరేగింపు చేశారు. భక్తిగీతాలకు యువకులు నృత్యాలు, మహిళలు బొడ్డెమ్మలు ఆడారు. భక్తుల కోసం బస్టాండు ఆవరణలో ప్రసాదం వితరణ చేశారు. హనుమాన్ శోభయాత్ర సందర్భంగా ముస్లింలు భక్తులకు పండ్లు పంచారు.



ఖిల్లాఘనపురంలో హనుమాన్ శోభాయాత్ర నిర్వహిస్తున్న గ్రామస్తులు



గోపాల్‌పేటలో హనుమాన్ శోభాయాత్ర

రాజ్యాంగాన్ని రక్షించుకుందాం



మాట్లాడుతున్న కేవీపీఎస్ జిల్లా అధ్యక్షులు భగత్

పాన్‌గల్: మహనీయులు రూపొందించిన రాజ్యాంగం పెను ప్రమాదంలోకి నెట్టబడుతుందని, దానిని రక్షించుకునేందుకు అందరం కలిసి కట్టుగా ఉద్యమించాలని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు భగత్ అన్నారు. మహనీయులు పూలే, అంబేడ్కర్ సందేష్ బైక్ యాత్రను గురువారం మండలంలోని రేమద్దులలో సర్పంచ్ మంజులతో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెలలో మహనీయుల మాసం అని మహాత్మ జ్యోతిరావు పూలే, రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్, మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ జయంతి ప్రాముఖ్యతను ప్రజలకు తెలియపర్చాలని సూచించారు. రాజ్యాంగ రిజర్వేషన్లు, ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకుందాం అనే నినాదంతో ఈనెల చివరి నాటికి గ్రామాల్లో బైక్ యాత్రలను నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో చంద్రశేఖర్, మల్లేష్, నర్సింహ్మా, బాలకిష్టయ్య, రాములు, శేఖర్, భాస్కర్, ఆనంద్, సీఐటీయూ నాయకులు రాము పాల్గొన్నారు.

రాజకీయ క్రీడగా పేపర్ లీకేజీ వ్యవహారం



మాట్లాడుతున్న కె.సూర్యం

అమరచింత: రాష్ట్రంలో ప్రస్తుతం పదో తరగతి పరీక్షా పత్రాల లీకేజీ వ్యవహారం రాజకీయ క్రీడగా మారిందని సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సూర్యం అసహనం వ్యక్తం చేశారు. పట్టణంలోని మార్క్స్ భవనంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పదో తరగతి పరీక్షా పత్రాలు, టీఎస్‌పీఎస్సీ పరీక్షా పత్రాల లీకేజీని బీజేపీ, బీఆర్ఎస్ రాజకీయ క్రీడగా మార్చాయని ఎద్దేవా చేశారు. వారికి రాజకీయ లాభాలు తప్పా విద్యార్థులు, నిరుద్యోగుల ఆర్తనాదాలు వినబడడం లేదని విమర్శించారు. పేపర్ లీకేజీపై సిట్టింగ్ జడ్జీతో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రాజు, సామెలు, చింతలన్న, జిలాని పాల్గొన్నారు.

మోదీ పాలన ప్రజాస్వామ్యానికి చెంపపెట్టు



మాట్లాడుతున్న బాల నరసింహ

అమరచింత: ప్రధాని నరేంద్రమోదీ నియంత పాలనపై సీపీఐ ఆధ్వర్యంలో 'పల్లెపల్లెకు సీపీఐ' అనే నినాదంలో పాదయాత్రలను నిర్వహిస్తున్నామని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాలనరసింహ అన్నారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ భవన్‌లో గురువారం మక్తల్ నియోజకవర్గ స్థాయి సీపీఐ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈమేరకు బాలనరసింహ మాట్లాడుతూ బీజేపీ హటావో.. దేశ్‌కు బచావో అన్న నినాదంతో ఏప్రిల్ 14 నుంచి పల్లెల్లో పాదయాత్రలను నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో కొండన్న, అబ్రహం, రాబర్ట్ , మోషా, భాస్కర్, శ్యాంసుందర్, నరసింహా, లక్ష్మీనారాయణ శెట్టి పలువురు పాల్గొన్నారు.

బండి సంజయ్ దిష్టిబొమ్మ దహనం



వనపర్తి: పదో తరగతి పరీక్ష లీకేజీలో ప్రముఖపాత్ర పోషించారని ఆరోపిస్తూ.. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్ దిష్టిబొమ్మను బీఆర్ఎస్ నాయకులు అంబేడ్కర్ చౌరస్తాలో దహనం చేశారు. రాష్ట్ర ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేసేందుకే బండి కుట్ర చేశారని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్, మార్కెట్ చైర్మన్, పలుస రమేష్ ఆరోపించారు. బీజేపీ శ్రేణులు చేస్తున్న కుట్రను ప్రజలు గమనిస్తున్నారని, పేపర్ లీక్‌లో దొరికి బుకాయిస్తున్నారని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ బాలుడి మృతి



దినేష్ (ఫైల్)

గోపాల్‌పేట: గొల్లోనిమిట్ల సమీపంలో మార్చి 29న ద్విచక్రవాహనం చెట్టుకు ఢీకొట్టి గాయాల పాలైన పదో తరగతి విద్యార్థి వల్లెపు దినేష్ (14) గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం మరణించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కుమారుడు మరణించడంతో కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు.

నిధుల మంజూరుపై హర్షం

పెబ్బేరు: పట్టణ కేంద్రం నుంచి కంచిరావుపల్లితండాకు బీటీ రోడ్డు నిర్మించడానికి నిధులు మంజూరు కావడంపై ప్రజాప్రతినిధులు గురువారం హర్షం వ్యక్తం చేశారు. మున్సిపాలిటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ.. పట్టణ కేంద్రంలోని ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ నుంచి కంచిరావుపల్లి తండా వరకు 5 కిలోమీటర్ల మేర బీటీ కోసం టీఎస్ ఎస్‌డీఎఫ్ నిధుల నుంచి రూ.3.45 కోట్లు, దోబిఘాట్‌కు రూ.2 కోట్లు మంజూరు చేయడంతో ప్రజలు మంత్రి నిరంజన్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

మదనాపురం: ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి సహకారంతో లక్ష్మీపురం నుంచి నెలివిడి తండాకు రూ.1.03 కోట్లతో బీటీ రోడ్డు మంజూరు కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నెలివిడితండాలో గురువారం సీఎం కేసీఆర్ చిత్రపటానికి తండావాసులు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలోఎంపీపీ పద్మావతి, జెడ్పీటీసీ కృష్ణయ్య, మార్కెట్ చైర్మన్ శ్రవణ్‌కుమార్‌రెడ్డి, సర్పంచ్ కోట్ల రాములమ్మ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

వనపర్తి టౌన్: రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు విద్యుత్ అసిస్టెంట్ ఇంజనీర్ తులసి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని పాన్‌గల్ రోడ్డులో రోడ్డుకు అడ్డంగా ఉన్న స్తంభాలను మార్చడం, 11కేవీ లైన్ లాగడం, పాత ఎల్‌టీ లైన్‌కు ఉన్న గృహ, వ్యాపార, పరిశ్రమల వైర్లను కొత్తగా లాగిన వైర్లకు కలపనున్నట్లు పేర్కొన్నారు. ఈమేరకు పాన్‌గల్ రోడ్డు, మెట్టుపల్లి, చాముండేశ్వరి గుడి, తదితర ప్రాంతాల్లో ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు అంతరాయం కలుగుతుందని, ఆయా ప్రాంతాల్లోని వినియోగదారులు సహకరించాలని కోరారు.

అవినీతి రహిత పాలనే బీజేపీ ధ్యేయం



వనపర్తిలో జెండావిష్కరణ చేస్తున్న బీజేపీ నాయకులు

వనపర్తి క్రైం: అవినీతి, నియంతృత్వ, కుటుంబ పాలన పోవాలంటే బీజేపీ అధికారంలోకి రావాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజవర్ధన్‌రెడ్డి అన్నారు. బీజేపీ 43వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గురువారం జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయం , 4వ వార్డులో బీజేపీ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో బి.కృష్ణ, సబ్బిరెడ్డి, నారాయణ, రామన్‌గౌడ్, బుడ్డన్న, జింకల కృష్ణయ్య, పరశురాం, రామ్మోహన్, సీతారాములు, పెద్దిరాజు తదితరులు ఉన్నారు.

కొత్తకోట: పట్టణ కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో ఆ పార్టీ ఆవిర్భావ దినోత్సవం గురువారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అధ్యక్షుడు నెల్లికంటి శ్రీకాంత్‌రెడ్డి జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో భరత్‌భూషణ్, సంధ్య, మన్యం యాదవ్, నారాయణమ్మ, గుండు రవి, రాఘువేందర్‌రెడ్డి, దాబా శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

అమరచింత: అమరచింత, ఆత్మకూర్ మండలాల్లో గురువారం బీజేపీ జెండాకట్టల వద్ద పార్టీ పతాకాన్ని ఎగుర వేశారు. కార్యక్రమంలో మేర్వరాజు, అశ్విన్ కుమార్, క్యామ భాస్కర్, అనిల్ కుమార్, శ్రీనివాస్ యాదవ్, మాసన్న పాల్గొన్నారు.

బండి సంజయ్ అరెస్ట్ సరికాదు

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్‌ను అరెస్టు చేయడం అప్రజాస్వామికమని బీజేపీ, బీజేవైఎం నాయకులు అన్నారు. దీనిపై అమరచింత, ఆత్మకూర్ మండల కేంద్రాల్లో బీజేపీ నాయకులు నిరసన కార్యక్రమాలను నిర్వహించారు.

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో బీజేపీ ఆవిర్భావం పురస్కరించుకొని జిల్లా ఎస్టీమోర్చా అధ్యక్షుడు గోపినాయక్ ఆధ్వర్యంలో ఆ పార్టీ జెండాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో బుచ్చిబాబుగౌడు, అంజనేయులు, శివశంకర్, సత్యనారాయణ, ఈశ్వరయ్య, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

వీపనగండ్ల: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గ్రామాల్లో వివరించాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందని బీజేపీ మండల అధ్యక్షుడు రాకేశ్ యాదవ్ అన్నారు. మండలకేంద్రంలో పార్టీ జెండా ఎగరవేశారు. కార్యక్రమంలో ఆవుల నారాయణ, విష్ణు, రాణాప్రతాప్, ఆంజనేయులు చారి, సురేష్ యాదవ్, జగదీష్‌గౌడ్, మౌలాలీ, పురేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండల కేంద్రంలోని చౌరస్తాలో బీజేపీ మండల అధ్యక్షుడు వెంకటస్వామి ఆధ్వర్యంలో ఆ పార్టీ జెండాను ఎగురవేశారు.

మదనాపురం: మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో బీజేపీ నాయకులు ఆ పార్టీ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాధవరెడ్డి, కష్ణయాదవ్, కుమారస్వామి, వెంకటేష్, రామకష్టారెడ్డి తదితరులు పాల్గొన్నారు.